ఎల్లారెడ్డిపేట: బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట: గాలిపెల్లి గ్రామంలో బడి బాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఊరూరా బడిబాట

- సర్కారు బడిలో నాణ్యమైన విద్య
- పల్లెలు, వార్డుల్లో అవగాహన ర్యాలీ తీస్తున్న టీచర్లు

బోయినపల్లి: బడి బాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా అందిస్తున్న విద్యాబోధన, కల్పిస్తున్న వసతుల గురించి ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తప్పనిసరిగా చిన్నారులను సర్కారు బడిలోనే చేర్పించాలని కోరారు. ఈ క్రమంలో శనివారం ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో నిర్వహించిన బడి బాట కార్యక్రమానికి జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు హాజరయ్యారు. సర్కారు బడిలో నాణ్యమైన విద్య అందుతున్నదని ఆయన పేర్కొన్నారు. సర్కారు బడిలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధనపై అవగాహన కల్పించారు. ఇక్కడ హెచ్‌ఎం రామచంద్రం, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట, జూన్ 8: గాలిపెల్లి గ్రామంలో శనివారం బడిబాట నిర్వహించారు. పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని విద్యార్థుల తల్లిండ్రులకు అవగాహన కల్పించారు. ఇక్కడ ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, ఎర్రోజు బ్రహ్మచారి, తిరుమల, స్వామి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ప్రతి విద్యార్థి పాఠశాలకు రావాలి

బోయినపల్లి, జూన్ 8: ప్రతి విద్యార్థి పాఠశాలకు రావాలని ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి కోరారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న భోధనపై విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, తదితరులు ఉన్నారు.

రాజీయే రాజమార్గం

- 'లోక్ అదాలత్'తో కేసుల సత్వర పరిష్కారం
- జిల్లా జడ్జి ఎన్ ప్రేమలత
- జిల్లాలో 6,788 కేసులు పరిష్కారం

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత

గాంధీ చౌక్, జూన్8: రాజీయే రాజమార్గమని, లోక్‌అదాలత్‌లో రాజీ ద్వారా కేసులు సత్వర పరిష్కారం అవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై, మాట్లాడారు. మనది కాని ఆస్తిపై వ్యామోహమే సివిల్ తగాదాలకు ప్రధాన కారణమన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులతో కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందిపడొద్దని హితవు పలికారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్న సివిల్ కేసుల్లో కోర్టు ఫీజులు తిరిగి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైశ్వాల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన, సిరిసిల్ల బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, వేములవాడ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సదానందం, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

6,788కేసులు పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 6,788 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైశ్వాల్ తెలిపారు. ఇందులో 450 క్రిమినల్ కేసులు, 12సైబర్ క్రైమ్ కేసులు, 4,596 ప్రి లిటిగేషన్ కేసులు, 1,723డ్రంకెన్ డ్రైవ్ కేసులు, మూడు సివిల్ కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. నాలుగు మోటారు యాక్సిడెంట్ కేసులను పరిష్కారించగా, బాధితులకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి రూ.37లక్షల పరిహారం ఇచ్చేందుకు అంగికరించినట్లు తెలిపారు.

ఎనిమిది మందికి ఐపీ నోటీసులు

వేములవాడ, జూన్ 8: పట్టణానికి చెందిన పూజారి, జ్యోతిష్యుడు మహేశ్ గత నెల 3న దాదాపు రూ.2కోట్లు అప్పు చేసి ఉడాయించిన వ్యవహారం మరో మలుపు తిరిగింది. అధిక వడ్డీకి ఆశ చూపిన సదరు జ్యోతిష్యుడు, తాజాగా ఎనిమిది మందికి ఐపీ నోటీసులు పంపినట్లు తెలిసింది. ఇందులో ₹10లక్షల నుంచి ₹44లక్షల వరకు కోటీ50లక్షలు రూపాయలు అప్పు తీసుకున్నట్లు వారి వివరాలు వెల్లడిస్తూ నోటీసులు పంపినట్లు సమాచారం. దీంతో నోటీసులు అందుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

'గూడెం కథలు' ప్రారంభం

ముస్తాబాద్, జూన్ 8: గూడెంలో ఏకేఆర్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో మన ఊరు 'గూడెం కథలు' షార్ట్‌ఫిలిమ్‌ను ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఇక్కడ ఏకేఆర్ ప్రొడక్షన్ డైరెక్టర్ షాడ శ్రీనివాస్, వెంకటరమణ, యాక్టర్ శ్రీనివాస్, రచన మారుపాక శంకర్, పద్మయ్య, బాలకిషన్, కనకరాజు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్‌మహాజన్

తెలంగాణ చౌక్, జూన్ 8: సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ జిల్లా ప్రజలకు శనివారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. వారం రోజుల్లో జిల్లాలో జరిగిన సైబర్ నేరాల వివరాలను వెల్లడించి, అవగాహన కల్పించారు. లోన్ యాప్, లాటరీ, పార్ట్‌టైమ్ జాబ్, తక్కవ పెట్టుబడితో ఎక్కవ లాభం, పింక్ వాట్సాప్ పేరుతో మెసేజ్‌లు రాగానే ఆశపడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ ప్రమేయం లేకుండా ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పవద్దని సూచించారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కి కాల్ చేస్తే పోగొట్టుకున్న నగదు తిరిగి పొందే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఐదేండ్ల పాలన తృప్తినిచ్చింది

- కేటీఆర్ హయాంలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాం
- ఎంపీపీ శరత్‌రావు

ఎంపీపీ, జడ్పీటీసీ, పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

ముస్తాబాద్ జూన్ 8: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ఈ ఐదేండ్ల పాలన తృప్తినిచ్చిందని ఎంపీపీ జనగామ శరత్‌రావు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించగా, ఎంపీపీ మాట్లాడారు. జూలై 6న ప్రస్తుత పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగుస్తుందని తెలిపారు. ఈ ఐదేండ్లలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కాళేశ్వరం జలాలతో బీడు భూములను సాగులోకి తీసుకువచ్చామని తెలిపారు. పదవి కాలంలో సహకరించిన పాలకవర్గ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు వైద్య ఆరోగ్య కార్యక్రమంపై చర్చించారు. సాధారణ కాన్పులు జరుగడం లేదని సభ్యులు ప్రశ్నించగా, స్టాఫ్ నర్సు లేకపోవడంతో ప్రసవాలు జరుగడం లేదని వైద్యాధికారి సమాధానం చెప్పగా, వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాల నోటీస్ బోర్డుపై అంటించాలని కోరారు. అంగన్‌వాడీ భవనాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ముస్తాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్ అరవిందను ఎంపీడీవో రాజేందర్ ఆదేశించారు. అనంతరం ఎంపీపీతోపాటు జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులను ఎంపీపీ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్, అధికారులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

మృతిచెందిన ఆవుతో రైతు కరుణాకర్‌రెడ్డి

రాజన్న సిరిసిల్ల, జూన్ 8 (నమస్తే తెలంగాణ): జిల్లాలో శనివారం సాయంత్రం ఈదురు గాలులుతో కూడిన భారీ వర్షం కురిసింది. సిరిసిల్ల పటణం, అర్బన్ మండలంతోపాటు, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఉరుములు, మెరుపులతో వాన దంచికొట్టింది. పలుచోట్ల రోడ్లకు ఇరుపక్కన ఉన్న చెట్లు నేలకూలాయి. స్తంభాలపై చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సెస్ సిబ్బంది వెంటనే స్పందించి, చెట్లను తొలగించి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. వర్షంతో గంట సేపు జనజీవనం స్తంభించిపోయింది. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా రెండు సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. మృగశిరకార్తె ప్రవేశించిన రోజే జిల్లాలో వర్షం కురువడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

మూగజీవాల మృత్యువాత

సిరిసిల్ల రూరల్, జూన్ 8: తంగళ్లపల్లి మండలంలో శనివారం కురిసిన వర్షంతో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. అంకుసాపూర్‌లో కరుణాకర్‌రెడ్డి అనే రైతుకు తన ఆవును చెట్టుకు కట్టేశాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు చెట్టుపై పడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. అదే విధంగా తాడూరులో కాసాని కిషన్‌కు చెందిన షెడ్డు గాలివానతో నేలకొరగా, షెడ్డులోని రెండు లేగదూడలు మృతిచెందాయి. ప్రభుత్వం బాధత రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అర్బన్ బ్యాంక్ చైర్మన్‌కు అభినందన

చైర్మన్ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, చక్రపాణి, నేతలు

సిరిసిల్ల టౌన్, జూన్ 8: ది సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా ఎన్నికైన రాపెల్లి లక్ష్మీనారాయణతోపాటు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళిని బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తమ నివాసంలో రాపెల్లి లక్ష్మీనారాయణ, అడ్డగట్ల మురళితోపాటు పలువురు డైరెక్టర్లను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇక్కడ బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, నాయకులు మ్యాన రవి, గుండ్లపల్లి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, సామల శ్రీనివాస్, బత్తుల రమేశ్, తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లో వసతులు కల్పించాలి

కూరగాయల మార్కెట్‌లో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, వ్యాపారులు

గంభీరావుపేట, జూన్ 8: మండల కేంద్రంలోని డైలీ కూరగాయల మార్కెట్‌లో తగిన వసతులు కల్పించాలని శనివారం వ్యాపారులతో కలసి గ్రామస్తులు నిరసన తెలిపారు. గంభీరావుపేట నడిబొడ్డున గల డైలీ మార్కెట్‌షెడ్‌ను ఆధునిక మార్కెట్ నిర్మాణంలో భాగంగా గత పంచాయతీ పాలకవర్గం కూల్చివేశారన్నారు. పాత మార్కెట్ షెడ్‌ను తీసేసి ఆరు నెలల గడచినా.. కొత్తది నిర్మాణం చేయకపోవడంతో పొద్దంతా ఎండలో ఉంటూ కూరగాయలు విక్రయిస్తూ నానా ఇబ్బందిపడుతున్నామని వ్యాపారులు ఆరోపించారు. కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న కుటుంబాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. పాత మార్కెట్ షెడ్‌ను కూల్చేసిన స్థలంలో తిరిగి కొత్తది నిర్మించాలంటూ కలెక్టర్‌కు పోస్టు ద్వారా వినతిపత్రం పంపించారు. కాగా, వీరికి గ్రామ పురోహితుడు రాచర్ల పార్థసారథిశర్మతోపాటు పలువురు గ్రామస్తులు సంపూర్ణ మద్దతు పలికారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి: డీఎంహెచ్‌వో

సబ్ సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పలు సబ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్, గర్భిణుల వివరాలు, వారి పరీక్షలకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. వంద శాతం ప్రసవాలు సర్కారు దవాఖానల్లో జరిగేలా చూడాలని ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు సూచించారు. ఇక్కడ ఏఎన్‌ఎంలు భూలక్ష్మి, అమృతవల్లి, ఆశ కార్యకర్తలు కవిత, లత, ప్రవంతి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, జూన్ 8: మండల కేంద్రంలోని కొలకాని నవీన్ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★Karimnagar-Hyd Highway Road, R.K.Colony Residential & Commercial 6 Guntas Plots are available. Contact on: 7780646886.
NT-327730

CHANGE OF NAME

★S. HEMALATHA W/o. Narender H.No: 10-2-47, Sainagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. My Name was changed as Kondi Latha W/o. Narender.
NTK-311496

పాస్ పోర్ట్ పోయినది

తేది: 01/11/2014, రోజున కరీంనగర్ మంకమ్మతోట నుండి భాగ్యనగర్‌కి మా యొక్క ఇల్లు షిఫ్టింగ్ చేస్తుండగా మార్గ మధ్యంలో నా యొక్క Passport (No: G4482160) పోయినది. దొరికిన వారు సంప్రదించండి||
కన్నోజు శ్రీనివాస్
సెల్: 9959933151

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

సీఎంతో ముఖాముఖికి విద్యార్థిని ఎంపిక

ముస్తాబాద్, జూన్ 8: బందనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పాతూరి ప్రణవి ఇటీవల విడుదలైన పదో తరగతిలో ఫలితాల్లో 10జీపీఏ సాధించింది. ఈ సందర్భంగా ఈ నెల 9, 10 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డితో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమానికి సదరు విద్యార్థిని ఎంపికైంది. దీంతో పాఠశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి, ప్రణవిని అభినందించారు.

వేతనాలపై పెంపు పై హర్షం

సిరిసిల్ల రూరల్, జూన్ 8: బీడీ పరిశ్రమలో ప్యాకర్లు, బట్టీ, టేకేదారు, బీడీ కట్టలకు బుర్రలు పెట్టె కార్మికులకు వేతనాల పెంపుపై తెలంగాణ బహుళ జన బీడీకార్మిక సంఘం, బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. తంగళ్లపల్లిలోని దేశాయి, టెలిఫోన్, ఎంఎస్ లాంగర్, ఠాకూర్ సాదేకర్ బీడీ కేంద్రాల్లో సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులను ఘనంగా సన్మానించారు. ఇక్కడ కార్మికులు ప్రభు, వెంకటేశం, ప్రసాద్, సురేశ్, శ్రీకాంత్, కొండయ్య, హరి, సిద్ధిరాములు, యాదగిరి, రమేశ్, శేఖర్, ప్రసాద్, కామయ్య, తిరుపతి, జనార్దన్, లత, వనజ, తదితరులు ఉన్నారు.

10న చలో హైదరాబాద్

ఇల్లంతకుంట, జూన్ 8: ఈ నెల 10న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నారం నర్సయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఆయన పెద్దలింగాపూర్‌లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కార్మికుల వసతుల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ అమలు-సవాళ్లు అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

ముస్తాబాద్, జూన్ 8: మండల వనరుల కేంద్రంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల యూనిఫామ్స్ పంపిణీ చేశామని మండల విద్యాశాఖ నోడల్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. 6నుంచి 10 తరగతి విద్యార్థులకు నోట్‌బుక్‌లను ఆయా పాఠశాలల సిబ్బందికి పంపిణీ చేశామన్నారు. ఇక్కడ ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటు సంతోషకరం

ముస్తాబాద్, జూన్ 8: గ్రామాల్లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం సంతోషకరమని జడ్పీటీసీ గుండం నర్సయ్య పేర్కొన్నారు. ఆవునూర్ గ్రామంలోని పెద్ద చెరువు కట్ట వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ సేనా సభ్యుల ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఇక్కడ సేన అధ్యక్షుడు కాసారపు రవి, కోశాధికారి అంజిరెడ్డి, కార్యదర్శి సత్యం, ప్రచారక్ సొల్ల క్రాంతి కుమార్, విశ్వనాథ్, వేణు, రవి, మిర్యాల్‌కార్ శ్రీనివాస్, సతీశ్‌చందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఎల్‌వోసీ అందించిన ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, జూన్ 8: సోమారంపేట గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతుండగా, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం రూ.2.50లక్షల ఎల్‌వోసీని ఎంపీపీ ఊట్కూరి వెంకటమణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ రూరల్, జూన్ 8: నాగయ్యపల్లిలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఎస్‌ఐ మారుతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, ఈ నెల 13న సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డీగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీయువకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం మేళాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రోండి రాజు, లక్ష్మణ్, అంజయ్య, తిరుపతి, మల్లేశం, నవీ న్, మహేశ్, పరశురాం, ప్రభాకర్, ప్రణయ్ పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

వేములవాడ టౌన్, జూన్ 8: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో శనివారం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రాతఃకాల పూజ 11మంది రుత్వికులు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అనుబంధ దేవాలయాల్లో కూడా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రుద్రంగి, జూన్ 8: మండల కేంద్రానికి చెందిన నంద్యాడపు నర్సింగ్ ఇటీవల మరణించగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటానని బాధిత కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. ఆయన వెంట చెలుకల తిరుపతి, సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పల్లి గంగాధర్ ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, నేతలు

వైద్య సిబ్బందిపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: మండల కేంద్రానికి చెందిన రాకేశ్-ఖైరుబీ దంపతులకు నాలుగు నెలల క్రితం రెండో కూతురు అన్విశ్రీ జన్మించింది. ఇదివరకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో రెండు టీకాలు వేశారు. గత మే 29న మూడో టీకా వేయడంతో ఆ చిన్నారికి సాధారణ జ్వరం వచ్చింది. దీంతో దవాఖానలో ఇచ్చిన సిరప్ తాగించారు. ఈ నెల 1న వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యులు అందించిన మందులు వాడారు. అయినా తగ్గకపోవడంతో 3న ఉదయం దవాఖానకు తీసుకెళ్లేసరికి ఆ చిన్నారి మృతి చెందింది. టీకా వేయడంతోనే మృతి చెందిందని, వైద్య సిబ్బందిపై అనుమానం ఉందని చిన్నారి తల్లి షేక్ ఖైరుబీ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

మృతదేహం తీసి.. పోస్టుమార్టం చేసి..

ఇటీవల టీకాతో తన కూతురు మృతి చెందిందని మండల కేంద్రానికి చెందిన బుర్క రాకేశ్ కలెక్టర్ అనురాగ్ జయంతికి ఫిర్యాదు చేయగా, కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య సిబ్బంది చిన్నారి అన్విశ్రీ మృతదేహానికి శనివారం పోస్టుమార్టం చేశారు. చిన్నారిని పూడ్చిపెట్టిన స్థలంలో టెంట్ ఏర్పాటు చేసి ఎంఆర్‌వో రామచంద్రం, ఆర్‌ఐ సంతోష్ సమక్షంలో చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, రిపోర్టు ఆధారంగా మృతికి గల కారణాలను తెలియనున్నాయి.

మతోన్మాద కార్పొరేట్లకు వ్యతిరేకంగా పోరాడాలి

వేములవాడ, జూన్ 8: కార్మికుల కష్టాలను దోచుకునే మతోన్మాద కార్పొరేట్లకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. శనివారం వేములవాడ మహాలింగేశ్వర గార్డెన్‌లో సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం కాగా, రాజకీయ అర్థశాస్త్రం అంశంపై ఆయన బోధించారు. దేశంలో మరోసారి మతోన్మాదులు అధికారంలోకి వచ్చారని, తద్వారా దేశ సమైక్యతకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఈ క్యాక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు ఎర్రవెల్లి నాగరాజు, గన్నారం నర్సయ్య, కోడం రమణ, ముక్తికాంత అశోక్, జవ్వాజి విమల, మల్లారపు అరుణ్‌కుమార్, సూరం పద్మ, శ్రీధర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

కోనరావుపేట జట్టుకు బహుమతి అందజేస్తున్న సీఐ

కోనరావుపేట, జూన్ 8: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ సూచించారు. గత పది రోజుల నుంచి మరిమడ్ల గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, శనివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. విన్నర్ కోనరావుపేట జట్టుకు రూ.20వేల నగదుతో పాటు బహుమతి, రన్నరప్ మరిమడ్ల జట్టుకు రూ.10వేల నగదుతోపాటు బహుమతి అందజేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, భాస్కర్‌రావు, తదితరులు ఉన్నారు.

మానసిక పరిస్థితి బాగలేక..

- ఉరేసుకుని మహిళ బలవన్మరణం

కోనరావుపేట, జూన్ 8: మానసిక వ్యాధితో బాధపడున్న ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆవురం రాజవ్వకు (55) కొన్నేండ్లుగా మానసిక పరిస్థితి బాగలేకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో భర్త చంద్రయ్య దగ్గర ఉండి చూసుకోగా, మందులు ఇచ్చి ఇంటికి పంపించారు. శుక్రవారం రాత్రి సమయన ఇంట్లో భర్తతోపాటు కూతురు శ్వేత నిద్రిస్తున్నారు. రాజవ్వ ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.